సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం ॥ 8 ॥ ఏప్రిల్ ॥ 2024



సోమశిలలో 9.069 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 9.069 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 870 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,160
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,535
3 శాతం జీఎస్టీతో..	రూ.6,731
నవర (8 గ్రా)	రూ.53,848



సెంట్రింగ్ కార్మికులకు అండగా ఉంటా


నెల్లూరులో జరిగిన సెంట్రింగ్ కార్మికుల ఆత్మీయ సమావేశంలో వారికి అండగా ఉంటామంటూ వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. IIలో



ఉప్పొంగిన జలనిధి

సమృద్ధిగా భూగర్భజలాలు

- జిల్లాలో లేని నీటి సమస్య
- పలుచోట్ల 3 మీటర్ల లోతు లోనే నీరు అందుతున్న వైనం
- గత టీడీపీ ప్రభుత్వంలో ఏటా నీటి కష్టాలు ఎదుర్కొన్న ప్రజలు



నెల్లూరు(పొగతోట): గత ఐదేళ్లలో కురిసిన వర్షాలతో జిల్లాలో భూగర్భజలాలు సమృద్ధిగా ఉన్నాయి. వరుణుడి కరుణతో ఏటా వర్షాలు పుష్కలంగా కురవడంతో ప్రాజెక్టులు, చెరువులు, కాలువలు, వాగులు, వంకలు నీటితో కళకళలాడాయి. అంతేకాకుండా భూగర్భ జలమట్టం పెరిగి తక్కువ లోతు లోనే నీరు లభించాయి. భూమిలో మూడు మీటర్ల లోతు లోనే నీళ్లు లభిస్తున్నాయంటే భూగర్భ జలమట్టం ఏ మేరకు పెరిగిందో అర్థం చేసుకోవచ్చు.

గత ప్రభుత్వంలో నీటి కష్టాలు

జిల్లాలో 37 మండలాలు ఉన్నాయి. 766 గ్రామ పంచాయతీలు, 1,201 రెవెన్యూ గ్రామాలు, 1,732 మజరా గ్రామాలు ఉన్నాయి. సుమారు 22 లక్షల మందికిపైగా జనాభా ఉన్నారు. 2019వ సంవత్సరం నుంచి జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురిశాయి. దీంతో భూగర్భజలాలు వృద్ధి చెందాయి. తద్వారా సాగు, తాగునీటి సమస్యలు ఎక్కడా కనిపించలేదు. 2018–19 సంవత్సరానికి ముందు వర్షాలు సక్రమంగా కురవక భూగర్భజలాలు అడుగంటిపోయాయి. బోర్లు ఎండిపోయాయి. మంచినీటి పథకాలు నిరుపయోగంగా మారాయి. మహిళలు తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి నీరు తీసుకునే పరిస్థితి ఉండేది. నీటి కోసం ప్రజలు, రైతులు నానా అవస్థలు పడ్డారు. రైతులు వర్షాలు ఎప్పుడు కురుస్తాయా అని ఎదురు చూసేవారు. కాగా అప్పటి టీడీపీ ప్రభుత్వం 2018లో 801 గ్రామాలకు, 2019లో 481 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసింది. తాగునీటి రవాణా కోసం 2018లో రూ.4.82 కోట్లు, 2019లో రూ.27.75 కోట్లు ఖర్చు చేసింది. అప్పట్లో నీటి ట్యాంకర్ ఎప్పుడు వస్తుందా అని ఆయా గ్రామాల్లోని ప్రజలు ఎదురుచూసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వర్షాలు సమృద్ధిగా కురిసి ఎక్కడా నీటి సమస్య లేకుండా పోయింది. ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసే గ్రామాల సంఖ్య సున్నాకు చేరుకుంది. తాగునీటి రవాణాకు ప్రభుత్వం పైసా ఖర్చు చేయలేదు.

జిల్లాలో..

మండలాలు - 37	3 నుంచి 8 మీటర్ల లోతులో నీరు లభించే మండలాలు - 26
జనాభా - 22 లక్షల మందికిపైగా..	
3 మీటర్ల లోతు లోనే నీరు లభించే మండలాలు - 6	8 నుంచి 15 మీటర్ల లోతులో నీరు లభించే మండలాలు - 4

ప్రస్తుతం ఎక్కడ చూసినా సమృద్ధిగా..

జిల్లాలో ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి 61.58 టీఎంసీల భూగర్భజలాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. అప్పటి నుంచి కొంతమేరకు జలాలు ఖర్చయ్యాయి. ప్రస్తుతం జిల్లాలో 3 మీటర్ల లోతులోనే భూగర్భజలాలు లభించే మండలాలు 6 ఉన్నాయి. అలాగే 3 నుంచి 8 మీటర్ల లోతులో భూగర్భజలాలు లభించే మండలాలు 26 ఉండగా.. 8 నుంచి 15 మీటర్ల లోతులో నీరు అందే మండలాలు 4 ఉన్నాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఎక్కడా నీటి ఇబ్బందులు లేవని అధికారులు తెలిపారు. తాగునీటి కోసం ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడడం లేదు. భూగర్భజలాలు సమృద్ధిగా ఉండడంతో ట్యాంకర్ల ద్వారా గ్రామాల్లో మంచినీటిని సరఫరా చేయాల్సిన అవసరమే లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు ఈ ఏడాది జూన్ నెలలో సీతారామపురం, వరికుంటపాడు మండలాల్లోని కొన్ని గ్రామాల్లో మాత్రమే మంచి నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాల్సిన అవసరం వస్తుందని ముందస్తుగా ప్రభుత్వానికి నివేదికలు పంపారు.

భూగర్భజలాలు వృద్ధి చెందాయి



గత నాలుగేళ్లలో వర్షాలు బాగా కురిశాయి. భూగర్భజలాలు అభివృద్ధి చెందాయి. జిల్లాలోని కొన్ని మండలాల్లో 3 మీటర్ల లోతులోనే నీరు లభిస్తున్నాయి. ఎక్కడా మంచినీటికి ఇబ్బందులు లేవు. ఇరిగేషన్ చెరువుల్లో నీరు అందుబాటులో ఉంది. రెండు నెలల తరువాత రెండు, మూడు మండలాల్లో భూగర్భజలాలు తగ్గే అవకాశం ఉంది.
– ఆర్.శోభన్‌బాబు, డీడీ, భూగర్భజలాలశాఖ

సెక్టోరల్ అధికారుల పాత్ర అత్యంత కీలకం

- కలెక్టర్ హరినారాయణన్



ఆత్మకూరు: 'ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర అత్యంత కీలకం. వారు పోలింగ్‌కు ముందు రోజు, పోలింగ్ రోజు అప్రమత్తంగా వ్యవహరించాలి. మాక్‌పోల్ మొదలు చివరి ఓటు వేసే వరకు బాధ్యతగా ఉండాలి' అని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అన్నారు. ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల సెక్టోరల్ అధికారులకు ఆదివారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్వోలకు, పోలింగ్ అధికారులకు వారధిలా సెక్టోరల్ అధికారులు విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ ముగిసే వరకు ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు బాధ్యతగా పనిచేయాలన్నారు. నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచి పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వివరాలు, రూట్ మ్యాప్‌లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పీఓ, ఏపీఓల శిక్షణలో వారు తప్పకుండా పాల్గొని సందేహాలను తీర్చాలన్నారు. ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకొనేలా పోలింగ్ కేంద్రాల్లో వాతావరణం ఉండేలా చూడాలన్నారు. ఈవీఎంల మేనేజ్‌మెంట్‌పై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. మే 13వ తేదీన పోలింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యేందుకు మూడు గంటలు ముందుగా సెక్టోరల్ అధికారులు పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలన్నారు. గంటన్నర ముందుగా మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు, ఆర్డీఓ మధులత, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

15 నుంచి చేపల వేటపై నిషేధం

- 61 రోజులు విరామం



కృష్ణపట్నం తీరంలో మరపడవలు (ఫైల్)

ముత్తుకూరు: రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 15వ తేదీ నుంచి సముద్రంలో చేపల వేటపై ప్రభుత్వం నిషేధం ప్రకటించిందని మత్స్యశాఖ అధికారులు ఆదివారం తెలిపారు. ఈ నిషేధం జూన్ 14వ తేదీ వరకు అమలులో ఉంటుందని తెలిపారు. సముద్రంలో చేపలు, రొయ్యలు, ఇతర మత్స్యసంపద సంతాన ఉత్పత్తి చేయాల్సి ఉండడం వల్ల ఈ నిషేధం అమలు చేస్తున్నారు. వేట నిషేధ సమయంలో పడవలు, తెప్పలు, మరపడవలు, లాంచ్‌లు తదితర బోట్లు ఏపీ సముద్రంలోకి వెళ్లరాదు. చేపల వేట చేయరాదు. నిషేధం ఉల్లంఘించిన వారికి జరిమానా విధించిన సందర్భాలు కూడా ఉన్నాయి. చేపల వేట నిషేధ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార భరోసా పథకం ద్వారా మత్స్యకార కుటుంబానికి రూ.10,000 ఆర్థికసాయం అందిస్తుంది.

బ్రాహ్మణుల రక్షణకు అట్రాసిటీ చట్టం తేవాలి



నెల్లూరు(బృందావనం): బ్రాహ్మణ సంఘీయుల రక్షణ కోసం ప్రభుత్వాలు ప్రత్యేక అట్రాసిటీ చట్టం రూపొందించాలని అఖిల బ్రాహ్మణ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అవధానం సాయికుమార్ కోరారు. నగరంలోని బాలాజీనగర్ శ్రీత్యాగరాజ కల్యాణ మండపంలో ఆదివారం అఖిల బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బ్రాహ్మణ అట్రాసిటీ చట్టం సాధన కోసం 'బ్రాహ్మణ ఘోష' సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అగ్రవర్ణంగా పేర్కొంటున్న బ్రాహ్మణ సంఘీయుల్లో అధికులు దారిద్ర్యరేఖకు దిగువగా ఎన్నో సమస్యలతో జీవనం సాగిస్తున్నారని, వారి సమస్యలను ప్రభుత్వాలు తెలుసుకుని అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బ్రాహ్మణ సంఘం నేత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ బ్రాహ్మణ ఐక్యతను సమాజానికి చాటాలన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ క్రెడిట్ కార్పొరేషన్ సొసైటీ మాజీ డైరెక్టర్ తడకపల్లి సుధారవీంద్ర, డాక్టర్ జేవీ రామమోహన్, డాక్టర్ ఏవీ సాయి మహేష్, తేజేశ్వరి, వంజారి సుప్రియ, ముంగమూరి అన్నపూర్ణ, శోభాజానకి, బ్రాహ్మణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మైలవరం మురళీమోహన్, జంగా శ్రీనివాసకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేని నిమ్మకాయలతో ధరలు తగ్గుముఖం



పొదలకూరు: ఏప్రిల్ నెల వచ్చి వారం గడిచినా నిమ్మకాయల ధరలు పుంచుకోవడం లేదు. నిమ్మ సాగు చేసే రైతులకు మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే కాయలకు గిట్టుబాటు ధరలు లభిస్తాయి. అంతేకాక మార్కెట్ అమాంతం పెరిగి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం ఉంటుంది. అయితే నిమ్మకాయల ధరలు ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో నిమ్మకాయలు రూ.50 నుంచి రూ.70 వరకు మాత్రమే ధర పలుకుతున్నాయి. ధరలు వారం రోజులుగా దిగజారుతున్నట్లు రైతులు చెబుతున్నారు. తోటల నుంచి నాణ్యత కలిగిన నిమ్మ కాయలు రావడం లేదని, సైజులు తక్కువగా ఉన్న కాయలు మార్కెట్‌కు వస్తున్న నేపథ్యంలో ధరలు తగ్గుతున్నట్లు వ్యాపారులు తెలిపారు. దీనికితోడు ఢిల్లీ మార్కెట్‌కు ఇటీవల ఎగుమతులు బాగా పెరగడం వల్ల ధరలు పెరగడం లేదని చెబుతున్నారు.

న్యాయవాదుల సంక్షేమం జగన్‌తోనే సాధ్యం



ఎన్నికల చట్టం - నియమావళి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితరులు



సదస్సుకు హాజరైన న్యాయవాదులు

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి

నెల్లూరు(లీగల్): అన్ని వృత్తుల్లో న్యాయవాద వృత్తి భిన్నమైందని, న్యాయవాదుల సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి రామిరెడ్డి రోజారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని రామచంద్ర కల్యాణ మండపంలో పార్టీ లీగల్ సెల్ న్యాయవాదుల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి.. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ సమాజ సేవకులైన న్యాయవాదులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తాను అండగా నిలుస్తానన్నారు. న్యాయవాదుల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. గతంలో చంద్రబాబు న్యాయవాదుల కోసం 18 అంశాలతో మేనిఫెస్టో విడుదల చేశారని, వాటిలో ఒక్కటి కూడా అమలు చేయలేదని గుర్తుచేశారు. న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్ల నిధులు విడుదల చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. న్యాయవాదికి మరణానంతరం చెల్లిస్తున్న వెల్ఫేర్ ఫండ్ రూ.4 లక్షలకు అదనంగా మరో రూ.4 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం వాటాగా చెల్లిస్తోందని తెలిపారు. న్యాయవాద వృత్తిలోకి వచ్చిన జూనియర్ న్యాయవాదులకు ఒక్కొక్కరికి నెలకు రూ.5 వేల చొప్పున మూడేళ్లపాటు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నెల్లూరులో ఉన్న కోర్టు భవనాలు ఐదెకరాల విస్తీర్ణంలో ఉన్నాయని, భవిష్యత్ అవసరాల దృష్ట్యా జైలుకు సంబంధించిన స్థలాన్ని కోర్టు భవనాలకు కేటాయించాలని న్యాయవాదులు కోరారని, ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని తెలిపారు. అలాగే న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరారని, ఇందులో న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా మార్కెట్ విలువ ప్రకారం ఇవ్వడానికి కృషి చేస్తానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో న్యాయవాదులందరూ ఐక్యంగా వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి అయిన తనను, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని, నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్‌ను, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని, ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డిని, కావలి ఎమ్మెల్యే అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని, కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరురూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు నగర అభ్యర్థి ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ న్యాయవాదులకు సమాజాన్ని, వ్యక్తులను ప్రభావితం చేయగల శక్తి ఉందని, రానున్న ఎన్నికల్లో జిల్లాలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయాన్ని కృషి చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఎన్నికల నామినేషన్లు, ఇతర న్యాయపరమైన ప్రక్రియలో న్యాయవాదులు సలహాలు ఇచ్చి వారి విజయానికి కృషి చేయాలని కోరారు. అనంతరం వారు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్ సెల్ రూపొందించిన 'ఎన్నికల చట్టం.. ఎన్నికల ప్రవర్తన నియమావళి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ చైర్మన్ పొట్లూరి స్రవంతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు, న్యాయవాది మలిరెడ్డి కోటారెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి దన్నాల్ రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన ఇస్కపాళెం మహిళలతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీకి జై కొడుతున్న మహిళలు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు: రాష్ట్ర ప్రభుత్వం అన్నిరంగాల్లో మహిళలకు పెద్దపీట వేసిందని, ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీకి మహిళా లోకం జై కొడుతోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఇస్కపాళెం పంచాయతీకి చెందిన మహిళాశక్తి ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు తాటిబోయిన విజయమ్మతో సహా 200 టీడీపీ మహిళలు ఆదివారం నెల్లూరులోని మంత్రి కాకాణి నివాసంలో ఆయన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన మహిళలకు మంత్రి కాకాణి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత తదితర ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని తెలిపారు. ఇస్కపాళెం గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విఫలమయ్యారని, సోమిరెడ్డి తీరుతోనే గత వారం రోజుల్లో మూడు విడతలుగా వందలాది మంది ఇస్కపాళెం వాసులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారని తెలిపారు. నీరు–చెట్టు, రైతురథం పథకాల్లో అంతులేని అవినీతికి పాల్పడిన సోమిరెడ్డిని మరోసారి ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 80 శాతం మంది మహిళలు తనకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని, ఇది తన అదృష్టంగా భావిస్తానని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్, జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వహించండి

- నగదు, మద్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు
- ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్



పోలీసు అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ సూచించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలు, పాటించాల్సిన నియమాలు, ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు ఎస్పీ పలు ఆదేశాలిచ్చారు. ఆయన ఆదివారం నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగాలని, శాంతిభద్రతల పరిరక్షణ, నేరనియంత్రణ విషయంలో సమష్టిగా కృషి చేయాలని తెలిపారు. ప్రజలకు భద్రత, భరోసా కల్పిస్తూ నేరపూరిత కార్యక్రమాలు జరగకుండా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. చెక్‌పోస్టులు, టోల్‌ప్లాజాల వద్ద నగదు, మద్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి గ్రామ పెద్దలు, ప్రజలతో మమేకమై ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఎన్నికల్లో శాంతికి విఘాతం కలిగించే ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులను వెంటనే బైండోవర్ చెయ్యాలని ఆదేశించారు. నైట్ బీట్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. రాత్రి సమయాల్లో అనుమానాస్పద వ్యక్తులను, వాహనాలను తనిఖీలు చేయాలన్నారు. నేర చరిత్ర కలిగిన, జైలు నుంచి విడుదలవుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎలక్షన్ సంబంధిత ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) సౌజన్య, అడిషనల్ ఎస్పీ(క్రైమ్స్) ప్రసాద్, అడిషనల్ ఎస్పీ ఏఆర్ శ్రీనివాసరావు, సబ్ డివిజన్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రలోభాల పర్వం

- గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులకు ఎరవేసే యత్నం
- భారీ నగదు, పార్టీలో ప్రాధాన్యం ఇస్తామని ఫోన్లు
- యువతను ఆకర్షించేందుకు ఎత్తులు
- తిప్పికొడుతున్న అధికారపార్టీ నేతలు



పొదలకూరు: తెలుగుదేశం పార్టీ దిగుజారుడు రాజకీయాలకు పాల్పడుతోంది. ఎన్నికల్లో నేరుగా ఎదుర్కొని గెలిచే సత్తా లేక అధికారపార్టీ నేతలు, కార్యకర్తలను ప్రలోభాలకు గురిచేయాలనే ప్రయత్నంలో మరింత దిగజారి రాజకీయాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. టీడీపీ నేతలు గ్రామాలను ఎంచుకుని వైఎస్సార్‌సీపీ నాయకులకు ఫోన్లు చేసి నగదు ఆశ చూపడమే కాక పెత్తనం మీదేనంటూ నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నారు. అయితే గ్రామాల్లో స్ట్రాంగ్‌గా ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు టీడీపీ ఆకర్షణలకు లొంగకుండా ధీటుగా సమాధానం చెబుతున్నారు. పొదలకూరు మండలం తాటిపర్తి గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడికి ఇదే తరహాలో టీడీపీ నుంచి ఫోన్ వస్తే ఆయన ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఫోన్ కట్ చేసిన ఘటన ఇటీవల జరిగింది. ముఖ్యంగా సర్వేపల్లి నియోజకవర్గంలో మంత్రి కాకాణి సొంత మండలమైన పొదలకూరును టీడీపీ నాయకులు టార్గెట్ చేసి ప్రలోభాల పర్వానికి తెరతీశారని తెలుస్తోంది. పొదలకూరు మండలం నల్లపాళెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వైఎస్సార్‌సీపీ నేతలే లక్ష్యంగా నిత్యం ప్రలోభాల ఎరవేస్తున్నట్లు తెలిసింది.

భారీగా నగదు, పార్టీలో ప్రాధాన్యమంటూ..

నల్లపాళేనికి చెందిన టీడీపీ నాయకుడు, సోమిరెడ్డి అనుచరుడుగా వ్యవహరిస్తున్న వ్యక్తి వైఎస్సార్‌సీపీ నేతలకు ఫోన్లు చేస్తున్నట్లు తెలిసింది. పెత్తనం మీదేనని, ఖర్చులకు నగదు కూడా ఇస్తామని ప్రలోభపెడుతున్నారని సమాచారం. నాయకుడి సత్తాను బట్టి నగదు ఆఫర్ చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల చాలా మందికి ఫోన్లు చేసినా ఎవరూ స్పందించకపోగా కొందరు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

ముమ్మాటికి ఎన్నికల నియమావళి ఉల్లంఘనే

నాయకులు, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం ముమ్మాటికీ ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకే వస్తుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పొదలకూరులో ఓ పాల శీతల కేంద్రాన్ని స్థావరంగా చేసుకుని నగదు పంపిణీ కూడా జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ పాల శీతల కేంద్రంపై చాలా రోజులుగా అనేక ఆరోపణలు ఉన్నాయి. కల్తీ పాలను తయారు చేస్తూ భారీగా సొమ్ము చేసుకుని విచ్చలవిడిగా ఎన్నికల సందర్భంగా నగదు వెదజల్లుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఓట్లు అడిగితే తప్పు లేదని, ప్రలోభాలకు గురిచేసి నగదు ఇవ్వజూపే వ్యక్తులపై ఆధారాలు తమకు సమర్పిస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి ఎన్నికల ప్రచారం

కోవూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నియోజకవర్గ పరిధిలో సోమవారం నుంచి ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. తొలిరోజు విడవలూరు మండలంలోని విడవలూరులో బహిరంగ సభ, 10న బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడలో, 12న కోవూరు మండలం మోడేగుంటలో, 13న ఇందుకూరుపేట మండలంలోని కుడితిపాళెంలో, 14న కొడవలూరు మండలం యల్లాయపాళెంలో, 15న విడవలూరు మండలం వావిళ్లలో, 16న కొడవలూరు మండలం కమ్మపాళెంలో, 18న బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పెనుబల్లి ప్రాంతాల్లో ప్రచార సభలు జరుగుతాయి. వీటిని వైఎస్సార్‌సీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

రేపు పెంచలకోనలో ఉగాది వేడుకలు

రాపూరు: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో మంగళవారం ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 4 గంటలకు అభిషేకం, 5 గంటలకు పూలంగి సేవ, 9 గంటలకు బంగారు గరుడ వాహనంపై క్షేత్రోత్సవం, 11 గంటలకు పంచాంగ శ్రావణం, కల్యాణం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. సాయంత్రం 6 గంటలకు గోనుపల్లిలోని పెనుశిల నరసింహాస్వామి ఆలయంలో ఉగాది ఉత్సవం జరుగుతుందన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



వాహనం వద్ద అధికారులు

సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని పాతదేవరాయపల్లి ఎస్సీ కాలనీలో శనివారం అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వారి కథనం మేరకు.. రేషన్ బియ్యం తరలింపుపై సమాచారం అందడంతో అనంతసాగరం డీటీ గిరీష్ ఆ కాలనీకి చేరుకుని పరిశీలించారు. బొలెరో ట్రక్కులో 1.5 టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. అయితే వాహనం వద్ద ఎవరూ లేరు. దీంతో పోలీసులు, అధికారుల సహాయంతో దానిని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేష్ పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం



శిశువును అప్పగిస్తున్న సిబ్బంది


కలిగిరి: 108 అంబులెన్స్‌లో ఓ గర్భిణికి సురక్షితంగా కాన్పు చేశారు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కలిగిరి పంచాయతీ జీర్రావారిపాళేనికి చెందిన హజరత్తమ్మకు ఆదివారం పురిటినొప్పులు రావడంతో 108కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది ఆమెను ఆత్మకూరుకు తరలిస్తుండగా దారిలో నొప్పులు ఎక్కువయ్యాయి. ఈఎంటీ ఎస్కే మహ్మద్‌బాషా, పైలట్ సీహెచ్ వేణు డాక్టర్ల సూచనల మేరకు సురక్షితంగా కాన్పు చేశారు. హజరత్తమ్మ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను ఆత్మకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు (క్రైమ్): నెల్లూరు – వేదాయపాళెం రైల్వే స్టేషన్ల మధ్య దిగువ మార్గంలో రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం జరిగింది. మృతుడి వయసు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. నలుపు రంగు హాఫ్ హ్యాండ్స్ టీషర్ట్, నలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. కుడి చేతిపై మోహన కృష్ణ, ఎడమ చేతిపై వినోద్ అని పచ్చబొట్లున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు నెల్లూరు జీఆర్పీ ఎస్సై మాలకొండయ్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.70
సన్నవి : రూ.60
పండ్లు : రూ.24



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	161
లేయర్ (లైవ్) :	95
బ్రాయిలర్ చికెన్ :	280
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	310
లేయర్ చికెన్ :	162



మోసం చేయడమే చంద్రబాబు నైజం



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: 'ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నాయుడి నైజం. గతంలో హామీలిచ్చి నెరవేర్చలేదు. తిరిగి అధికారంలోకి రావాలని అబద్ధాలు చెబుతున్నాడు' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పొదలకూరు పట్టణం కాకాణి నగర్, టైలర్స్ కాలనీల్లో మంత్రి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014లో చంద్రబాబు 600 ఎన్నికల హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. దోచుకోవడం తప్ప ఆయన రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. బాబు పేరు చెబితే ఒక్క పథకం కూడా గుర్తురాదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం, మేమంతా సిద్ధం సభలకు జనాలు పోటెత్తినట్లు తెలిపారు. విలువలు, విశ్వసనీయత కలిగిన నాయకుడు కాబట్టే జనాలు తండోపతండాలుగా వస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలతోపాటు, ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

ఆశీర్వదించండి

'నేను మీ ఇంటి బిడ్డను. కరోనా కష్టకాలంలో నాయకులు బయటకు వచ్చేందుకు భయపడుతున్న సమయంలో మీ వద్దకు వచ్చి సరుకులు అందజేశాను. వచ్చే ఎన్నికల్లో నన్ను ఆశీర్వదించండి' అని కాకాణి విజ్ఞప్తి చేశారు. కాకాణి నగర్, టైలర్స్ కాలనీల్లో మట్టిరోడ్డు లేకుండా సీసీ రోడ్లను నిర్మించినట్లు తెలిపారు. గతంలో వారానికొకపర్యాయం మంచినీరు సరఫరా చేసేవారన్నారు. వచ్చే నెలలో కండలేరు ప్రత్యేక పైపులైను పూర్తయితే ప్రతిరోజూ మంచినీటిని పుష్కలంగా అందజేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఏమి కావాలో తనకు బాగా తెలుసన్నారు. మీ ఇంట్లో ఒక సభ్యుడిగా, పిలిస్తే పలికే వాడిగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. పరాయి పంచన చేరాల్సిన అగత్యం ఈ ప్రాంతవాసులకు పట్టలేదన్నారు. ఫోన్ చేస్తే సమస్యలను పరిష్కరించిన సందర్భాలను మంత్రి గుర్తు చేశారు. మొదట కాకాణికి పెద్ద ఎత్తున మహిళలు స్వాగతం పలికారు. ఇళ్లకు ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు నిర్మలమ్మ, ఎంపీటీసీలు ఎస్కే షాకీరాబేగం, జి.లక్ష్మీకల్యాణి, జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, వార్డు సభ్యుడు, మైనారిటీ నాయకుడు ఎస్కే అంజాద్, సర్పంచ్ చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎం.శేఖర్‌బాబు పాల్గొన్నారు.

సెంట్రింగ్ కార్మికులకు అండగా ఉంటా



పార్టీలో చేరిన వారితో ఆదాల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: సెంట్రింగ్ కార్మికులకు తాము అన్ని విధాలా అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, న్యాయవాది మలిరెడ్డి కోటారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సెంట్రింగ్ కార్మికుల ఆత్మీయ సమావేశం నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో జరిగింది. ఈ సందర్భంగా 200 మంది కార్మికుల కుటుంబాలు పార్టీలో చేరాయి. వారికి ఆదాల కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. చంద్రబాబు నాయుడు 14 సంవత్సరాలు సీఎంగా చేశారని, ఆయన పేరు చెబితే గుర్తుకొచ్చే పథకం ఒక్కటి కూడా లేదన్నారు. తాను ఏ ప్రాంతంలో ప్రజాప్రతినిధిగా ఉన్నా అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ఏ రోజూ వివాదాల జోలికి వెళ్లలేదన్నారు. రూరల్ నియోజకవర్గాన్ని రానున్న ఐదేళ్లలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపడమే లక్ష్యమన్నారు. సెంట్రింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేయర్ స్రవంతి, కార్పొరేటర్ మొయిళ్ల గౌరి, నాయకులు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, సురేష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, స్వర్ణా వెంకయ్య, సురేష్‌బాబు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లు, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రతి కుటుంబానికి పక్కాగా సంక్షేమ పథకాలు అందించారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కరటంపాడు పంచాయతీ పరిధిలో ఉన్న సాతానుపల్లి, శ్రీనివాసపురం గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు నాయుడి పాలనలో కరువు విలయతాండవం చేసిందన్నారు. ఐదేళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పంటలు బాగా పండాయన్నారు. 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకొనే చంద్రబాబు సంక్షేమ సారథి జగన్‌ను ఎదుర్కోలేక ఒక సినిమా యాక్టర్‌ను పక్కన పెట్టుకున్నారన్నారు. ఆ తర్వాత ఢిల్లీకి పరిగెత్తి మరో పార్టీతో పొత్తు పెట్టుకున్నాడని చెప్పారు. ఇప్పుడు అందరూ కలిసి దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఆ కూటమిని ప్రజలందరూ చిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. ఐదేళ్లలో కరటంపాడు పంచాయతీలో రూ.12.63 కోట్లను డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందించామన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం రూ.70 లక్షల మేర మాత్రమే మంజూరు చేశారని తెలిపారు. 171 మంది రైతులకు సంబంధించి 140 ఎకరాల భూ సమస్యలను పరిష్కరించామన్నారు. అంతకుముందు సాతానుపల్లిలో చక్రధర్ అనే యువకుడి ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన పలు కుటుంబాల వారు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అంతకుముందు మండల జేసీఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్రనాయుడు ఆధ్వర్యంలో కరటంపాడు పంచాయతీ ప్రజలు విక్రమ్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు మండల అధ్యక్షుడు చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, మాజీ సర్పంచ్ ఉంటా దొరస్వామి, ఆరవీడు, బోయలచిరివెళ్ల, పమిడిపాడు, సర్పంచ్‌లు సూరం ప్రసాద్‌రెడ్డి, బొలిగర్ల వెంకటేశ్వర్లు, మాలేపాటి సతీష్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు రఫీ, నెట్టెం పిచ్చయ్య, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య



సుబ్బరత్నమ్మ మృతదేహం

నెల్లూరు సిటీ: ఓ మహిళను గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేసిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. నెల్లూరు రూరల్ పోలీసుల కథనం మేరకు.. ఇందుకూరుపేటకు చెందిన దార్ల రమణయ్య, సుబ్బరత్నమ్మ (47) దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. వారు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సుబ్బరత్నమ్మ భర్త మాట వినకుండా నిత్యం స్నేహితురాళ్లతో బయటకు వెళ్తుండేది. ఒక్కోసారి రెండు, మూడు రోజుల తర్వాత ఇంటికి వస్తుంది. ఎంత చెప్పినా తీరు మార్చుకోకపోవడంతో భర్త ఆమెను పట్టించుకోవడం మానేశాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం తాను కూలి పనికి వెళ్తున్నట్లు రమణయ్యకు సుబ్బరత్నమ్మ చెప్పింది. సాయంత్రం ఆమె ఇంటికి రాకపోవడంతో భర్త చుట్టుపక్కల వారిని అడిగాడు. అయితే ఆచూకీ తెలియరాలేదు. ఆదివారం కోడూరుపాడు గ్రామంలో ఉన్న టెంకాయతోటలో ఓ మహిళ మృతిచెంది ఉండడాన్ని స్థానికులు గమనించారు. రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, సీఐ మారుతీకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సదరు మహిళను సుబ్బరత్నమ్మగా గుర్తించారు. ఆమె ముక్కులో నుంచి రక్తం వచ్చినట్లు గుర్తించారు. ఘటనా స్థలంలో పెనుగులాట జరిగిన ఆనవాళ్లున్నాయి. హత్య చేసినట్లుగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా మృతదేహానికి సమీపంలో స్థలంలో మొబైల్ ఫోన్ దొరికింది. అయితే అందులో కాల్ డేటాను డిలీట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో సాంకేతికత ఆధారంగా విచారిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న రాజమోహన్‌రెడ్డి

మర్రిపాడు: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అందించారు. ఆ పథకాలు కొనసాగించేందుకు ప్రజలంతా మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలి' అని నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి కోరారు. మండలంలోని వెంకటాపురం, కంపసముద్రం గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఆయన రచ్చబండ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సంక్షమమే ధ్యేయంగా, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిందన్నారు. అందుకే ఎమ్మెల్యేలు ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడుగుతున్నారన్నారు. అభ్యర్థుల ఎంపికలో జగన్ సామాజిక న్యాయం పాటించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎక్కువగా టికెట్లు కేటాయించారన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు కూటమి కట్టి వచ్చాడన్నారు. 2019లో ఇచ్చిన ఫలితాన్నే మళ్లీ ఆయనకు అందజేయాలని ప్రజలను కోరారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేస్తున్న వేణుంబాక విజయసాయిరెడ్డిని ఆదరిస్తే మన ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతున్నారు. ఆయన రాజ్యసభ సభ్యుడిగా రాష్ట్ర సమస్యల పరిష్కారం కోసం ఎన్నో మార్లు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడారన్నారు. రాజ్యసభలోనే ఉండి ఏనాడు ప్రజా సమస్యలు పట్టని వ్యక్తి ఇప్పుడు టీడీపీ తరపున పోటీలో ఉన్నారన్నారు. గౌతమ్‌రెడ్డి ప్రజలకు చేయాలనుకున్న ప్రతి అభివృద్ధి పనిని విక్రమ్‌రెడ్డి తప్పక పూర్తి చేస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా విజయసాయిరెడ్డిని, ఆత్మకూరు ఎమ్మెల్యేగా విక్రమ్‌రెడ్డిని ప్రజలు గెలిపిస్తే మెట్ట నియోజకవర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దుగ్గిరెడ్డి కృష్ణప్రసాద్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నారపరెడ్డి సుబ్బారెడ్డి, రామ్మోహన్, ఎంపీటీసీ హాజరత్‌రెడ్డి, చెన్ను వెంటేశ్వరరెడ్డి, బారతాల వెంకటసుబ్బయ్య, కంపసముద్రం సర్పంచ్ గుండుబోయిన వెంగయ్య, రాజారెడ్డి, లక్ష్మీరెడ్డి, కృష్ణారెడ్డి, చెన్ను శ్రీధర్‌రెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు తదితరుల

నెల్లూరు(టౌన్): కాకుటూరులోని కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని కళాశాల డైరెక్టర్లు కృష్ణారెడ్డి, పర్వతరెడ్డి రాణా ప్రమోద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు వారు మాట్లాడారు. దాదాపు 550 మంది హాజరు కాగా, పలు ఉద్యోగాలకు 150 మంది ఎంపికయ్యారని చెప్పారు. క్యాంపస్ ఎంపికలకు 16 కంపెనీలు హాజరయ్యాయని వివరించారు. కళాశాల డీన్లు మల్లికార్జునయ్య, జ్యోతి, ప్రిన్సిపల్ ప్రసాద్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ భానుచంద్రారెడ్డి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

వెంకటాచలం: గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని గొలగమూడిలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గొలగమూడిలోని భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆశ్రమ సమీపంలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 50 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. అనారోగ్యంతో చనిపోయి ఉండొచ్చని చెబుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 17 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 75,414 మంది స్వామిని దర్శించుకున్నారు. 30,073 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.68 కోట్ల ఆదాయం వచ్చింది. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు రెండు గంటల్లో దర్శనమవుతోంది.

నేదురుమల్లి సమక్షంలో పార్టీలో చేరిక



పార్టీలో చేరిన వారితో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: బాలాయపల్లి మండలానికి చెందిన టీడీపీ నేతలు చల్లా కోటేశ్వరనాయుడు, రమేష్ నాయుడు, బీజేపీకి చెందిన కొవి మల్లీశ్వరి చౌదరి ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానికంగా జరిగిన కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై ఇతర పార్టీల వారు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవిక చౌదరి పాల్గొన్నారు.

కండలేరులో 7.932 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 7.932 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 250 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మంచిమాట



తానెంతో జగమంత

ప్రతిమనిషి, సరిగా చెప్పాలంటే ప్రతి జీవి ప్రపంచం అంతా తన వంటిదనే అనుకుంటుంది. తన దృష్టికోణంలోనే చూస్తుంది. అందుకే అబద్ధాలాడేవారికి అందరూ అబద్ధాలు చెపుతారనే అభిప్రాయమే ఉంటుంది. ఎవరి మాటనీ ఒక పట్టాన నమ్మరు. తాను అబద్ధం చెప్పనప్పుడు ఎదుటివారు అబద్ధం చెపుతున్నారేమో అనే అనుమానం ఎందుకు వస్తుంది? పైగా తను చెప్పేది నిజం అని నమ్మమని ఒకటికి పదిసార్లు నొక్కి వక్కాణిస్తూ ఉంటారు. అవతలి వారు నమ్మరేమోననే సందేహం ఎందుకు వస్తుంది? తాను చెప్పే మాట మీద తనకే నమ్మకం లేదు కనుక.

ఇతరులని మోసం చేసే గుణం ఉన్నవారు ఇతరులు తమని మోసం చేస్తారేమో నని భయపడుతూనే ఉంటారు. మోసం చేసే బుద్ధి తనకి లేక పోతే ఎదుటి వారు తనని మోసం చేస్తారేమో ననే అనుమానం కూడా రాదు. పరాయి ఆడపిల్లలని చెడుదృష్టితో చూసేవారు తమ ఇంటి ఆడవారిని బయటకు పంపటానికి ఇష్టపడరు. దీనికి పెద్ద ఉదాహరణ రావణుడే. కనపడిన ప్రతి స్త్రీని కామదృష్టితో చూసి, చేజిక్కించుకోవాలనుకునే గుణం ఉన్నవాడు కనుకనే తన భార్యలని కట్టడిలో ఉంచాడు. మేలిముసుగు లేకుండా వారిని బయటికి రానిచ్చేవాడు కాదు. ఆ విషయాన్ని రావణ వధానంతరం యుద్ధభూమిలో పడి ఉన్న రావణుణ్ణి చూసి మండోదరి ''మేలిముసుగు లేకుండా నీ భార్యల మైన మేము ఇక్కడికి వస్తే ఏమి అనటం లేదేమి?'' అని ప్రశ్నించటంలో తెలుస్తుంది. అదే రావణుడు తన చెల్లెలు శూర్పణఖ విషయంలో అవేవీ పాటించ నక్కర లేదని చెప్పి స్వేచ్ఛగా వదిలేశాడు. రాక్షసవంశంలోనే పుట్టిన ప్రహ్లాదుణ్ణి ''కన్నుదోయి కన్యకాంత లడ్డం బైన మాతృభావము చేసి మరలువాడు'' అని పోతనామాత్యుల వారు వర్ణించారు. స్త్రీల పట్ల సద్భావం కలవాడు కనుక తన తల్లిని, ఇతర స్త్రీలని కూడా గౌరవభావంతో చూడటం తటస్థించింది.



జంతువులన్నీ ఇతర జంతువులు, ముఖ్యంగా మనుషుల మీద దాడి చేయటానికి కారణం వాటికి ఉన్న అభద్రతా భావం. అవి ఎదుటి జంతువులని తినటమో, బాధించటమో చేస్తాయి కనుక ఎదుటి జంతువులు కూడా తమని బాధిస్తాయేమోనని ఎదురు దాడి చేస్తాయి. నాగుపాముని చూస్తే ఈ విషయం బాగా అర్థమౌతుంది. మంచి జాతి సర్పం ఎదురు పడగానే మనిషి భయపడితే అది కూడా భయ పడుతుంది. దాని వంక ప్రేమగా, లేక భక్తితో చూస్తే అది కూడా అదే భావంతో చూసి తొలగిపోతుంది. అందుకే త్రాచు పాము కనపడగానే చేతులు జోడించి నమస్కారం చేసి కదల కుండా ఉండమని చెపుతారు. తేలుకి ఎదుటి ప్రాణి తనని బాధిస్తుందనే సందేహం ఉంటుంది కనుక ఏది అడ్డు తగిలితే దానిని కుట్టుకుంటూ పోతుంది. ఇటువంటి లక్షణాలే మనుషులలో కూడా కనిపిస్తాయి. అకారణంగా ఇతరులని బాధించేవారు, భయం వల్లనే బాధిస్తారు. పచ్చకామెర్ల రోగికి లోకం అంతా పచ్చగా కనిపిస్తుంది కదా!

అదేవిధంగా ''ఆత్మవత్ సర్వభూతాని'' అని భావించి ఎదుటివారి కష్టం తనది భావించి తదనుగుణంగా స్పందించేవారు, ఎవరికి మేలు కలిగినా తమకే కలిగి నంతగా సంతోషించేవారు ఉన్నారు. ఎవరికి ఆపద కలిగినా వీరి కళ్ళలో నీళ్ళు వస్తాయి. ఎవరికి మంచి జరిగినా వీరు పండగ చేసుకుంటారు. అంటే, ఈ కోవకి చెందిన వారు జంతు ప్రవృత్తి నుండి కొంత ఎదిగినట్టు చెప్పవచ్చు.

ఈ విధంగా ఉండి అందరు తనలాగానే ఉంటారు అనుకోవటం వల్ల లౌకికంగా నష్టపోయిన వారూ ఉన్నారు. కాని, మానవతా దృక్పథంలో వారు ఉన్నత స్థానానికి చేరుకున్నారని అర్థం. ప్రతిస్పందన కన్న సహ అనుభూతి ఉత్తమ స్థాయి.

– ఎన్. అనంతలక్ష్మి

తాత్త్వికథ

చెట్టునీడ



ఒకరోజు జ్ఞాని దగ్గరకు కోటీశ్వరుడు వెళ్లి స్వామి నా దగ్గర కోటానుకోట్ల డబ్బు ఉన్నది. పూర్తి ఆరోగ్యవంతుడిని. ఇక నేను ఎవరిపైనా ఆధారపడవల్సిన అవసరం లేదు. ఎవరినీ సహాయం చేయమని అర్థించాల్సిన అవసరం లేదని చాలా గొప్పగా చెప్పుకున్నాడు.

ఆ మాటలు విన్నాక జ్ఞాని నవ్వుతూ ''బాబు నాతో కాస్త దూరం నడవగలవా'' అని అడిగాడు. అయన ఆలా అడగడంతో నిరాకరించడం బాగుండదని తలచిన ఆ వ్యక్తి జ్ఞానితో కలిసి అడుగులు వేశాడు.

అలా నడుస్తూ నడుస్తూ అలసిపోయిన వ్యక్తి దరిదాపులలో ఏదైనా చెట్టు కనిపిస్తుందేమో... ఆ చెట్టు నీడలో కాసేపు సేద తీరాలని చుట్టూ చూసాడు. ఎక్కడా ఏ చెట్టూ కనిపించలేదు.

ఇది గమనించిన జ్ఞాని ''ఏంటి బాబూ... వెతుకుతున్నావు?'' అని అడిగాడు.

''అయ్యా చాల దూరం వచ్చాము. కాసేపు చెట్టునీడలోకి వెళ్లి సేదతీర్చుకుని ఆ తర్వాత తిరిగి ముందుకు సాగుదాం''అని చెప్పాడు.

అతడి మాటలకు ఆ జ్ఞాని ''చెట్టునీడ నీకెందుకు బాబూ... నీ నీడలో నువ్వు సేద తీర్చుకో'' అన్నాడు.

''నా నీడలో నేను ఎలా ఉండగలను స్వామీ! ఏం మాట్లాడుతున్నారు మీరు?'' అని కాస్తంత ఆశ్చర్యంగా మరి కాస్త నిష్ఠురంగానూ అడిగాడు ఆ వ్యక్తి.

అందుకు ఆ జ్ఞాని, చిరునవ్వుతో అతడి వైపు చూస్తూ... అదేంటి, నీ నీడలో నువ్వు తల దాచుకోలేవా? నువ్వే కదా బాబూ, నాదగ్గర అన్నీ ఉన్నాయి. నేను ఎవరిని ఆశ్రయించాల్సిన అవసరం లేదు అన్నావు, చూశావా! ఇప్పుడు నీ నీడ సైతం నీకు ఉపయోగపడలేదు'' అన్నారు.


ఇప్పుడు ఆ ఐశ్వర్యవంతుడికి నిజంగా జ్ఞానోదయం అయింది ఏ చెట్టు కిందకూ వెళ్ల కుండానే.

అందుకే పెద్దలన్నారు... అహంకరించవద్దు అని. ఎంత ధనవంతులైనా, వారికి ఎన్ని ఉన్నా ఎప్పుడు ఎవరికీ ఏది అవసరం అవుతుందో తెలియదు ఈ లోకంలో.

అన్నింటికీ మించి మనపైన మనకు నమ్మకం ఉండాలి అహం ఉండకూడదు. మన పైన మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి. అతేకానీ, ఇతరులపైన ఏమాత్రం చులకన భావం ఉండకూడదు... మనసులోకి రాకూడదు.

గృహస్థాశ్రమ విశిష్టత

పెళ్ళి... ఇద్దరి మధ్య వ్యవహారం కాదు



కోటలో యుద్ధం చేయడం గృహస్థాశ్రమం. కోట బయట చేసేవి ఇతర ఆశ్రమాలు. అవి జన్మతః వైరాగ్యం కలిగిన మహాపురుషులకే సాధ్యం. ఎన్నో జన్మల అనుష్ఠాన బలం వారిది. వారు కారణజన్ములు. చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామివారు, చంద్రశేఖర భారతీ మహాస్వామివారు, ఒక రామకృష్ణ పరమహంస, ఒక వివేకానందుడు, అరుణాచల భగవాన్ రమణులు... ఇటువంటివారు ఎక్కడో కోట్లలో ఒకరుంటారు.

కానీ అందరికి అందుబాటులో ఉండేది, అర్థకామములను ధర్మం తో ముడివేసుకోవడానికి యోగ్యమైనది – గృహస్థాశ్రమం. దీని ప్రవేశం... కేవలం ఒక పురుషుడికో, ఒక స్త్రీకో సంబంధించినది కాదు. అంటే పెళ్ళి ఎప్పుడూ పూర్తిగా వ్యక్తిగత విషయం కానే కాదు. ఇక్కడ సక్రమంగా ప్రవర్తించకపోతే... దాని చెడు ప్రభావం సమాజం మీద పడుతుంది. కచ్చితంగా మూడవ వ్యక్తి మీద అది ప్రభావం చూపి తీరుతుంది. అదే దంపతులిద్దరూ అన్యోన్యంగా బతకగలిగితే... మూడవ వ్యక్తికి ఆదర్శంగా నిలుస్తారేమో గానీ, సమాజాన్ని అది చెడుగా ప్రభావితం చేసే అవకాశమేలేదు.

వాళ్ళిద్దరూ పుట్టుకనుంచి కలిసి ఉన్నవారు కాదు, కలిసి చదువుకోలేదు, కలిసి బతకలేదు. అకస్మాత్తుగా ఇద్దరు కలుసుకుని జీవిత ప్రయాణానికి, ఒక ఆశ్రమ నియమానికి కట్టుబడటానికి సిద్ధమవుతున్నారు. మనం ఒక ఉద్యోగంలో చేరితేనే... సవాలక్ష నియమాలకు అంగీకరించినప్పడే దానిలో కొనసాగగలం. అటువంటిది ఒక జీవితకాలం పూర్తిగా కలిసి ఇద్దరూ ప్రయాణించాలి. పుట్టిన సంతానానికి మార్గదర్శకంగా నిలవాలి... అంటే దానికి ఎంతో పరిణతి ఉండాలి. జీవితం అంటే పూలపడవ కాదు కదా... వెలుతురు, చీకటి, కష్టాలు, సుఖాలు... అన్నింటినీ చక్కగా సమన్వయంతో, అవగాహనతో ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా వంశాభివృద్ధి చేసుకుంటూ సంసారనావను నడపాల్సి ఉంటుంది. అటువంటి సంసారంలో మంచి జరిగినా, చెడు జరిగినా అది సమాజాన్ని సానుకూలంగా కానీ, ప్రతికూలంగా కానీ ప్రభావితం చేస్తుంటుంది. అందుకే పెళ్ళి ఎప్పుడూ ఇద్దరి మధ్య వ్యవహారం కాదు.

ధర్మం, కామం, అర్థం సమంగా ఉంటే... మోక్షం అనేది కొత్తగా ప్రయత్నించి తెచ్చుకోనక్కర లేదు. అదే వస్తుంది. అంటే ధర్మబద్ధమైన అర్థం, ధర్మబద్ధమైన కామం ఉండాలి. నేను డబ్బు సంపాదిస్తే ధార్మికంగా సంపాదించానా ? ఖర్చుపెడితే.. ధర్మంకోసం ఖర్చు పెట్టానా? నాకు మనసులో ఒక కోరిక పుడితే ఇది ధర్మచట్రంలో ఇముడుతుందా? దీనిని నేను నెరవేర్చుకోవచ్చా? ... ఈ పరిశీలన అలవాటయితే అర్థం. కామం ధర్మానికి ముడిపడిపోయినట్టే. సామాన్యులకు కూడా ప్రయోజనం చేకూరాలని మన రుషులు ప్రవేశపెట్టిన మార్గం ఇది.. అదే గృహస్థాశ్రమం.

గృహస్థు అంటే కేవలం ఒక గృహంలో ఉన్నవాడని కాదు. గృహస్థాశ్రమ స్వీకారం చేశాడు... అంటే ధర్మాన్ని స్వీకరించాడు.. అని. తరువాత నిత్యకర్మ చేయకుండా ఎలా ఉంటాడు? అది సాధ్యం కాదు. ఏదో కర్మ చేయవలసిందే. దీనివల్ల చివరకు ప్రత్యేకంగా ప్రయత్నించకపోయినా మోక్షమే కలుగుతుంది. జ్ఞానాన్ని ఇచ్చిన భగవంతుడు మోక్షాన్ని కూడా ప్రసాదిస్తాడు.

రామాయణంలో భరతుడు ఒక మాటంటాడు. నాలుగు ఆశ్రమాలలోకి గృహస్థాశ్రమం శ్రేష్ఠమైనది -అని. అంతకన్నా గొప్పది మరొకటి లేదు.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా

వార్‌కు రెడీ!


● ఎన్టీఆర్

బాలీవుడ్ 'వార్'కు రెడీ అవుతున్నారు ఎన్టీఆర్. హృతిక్‌రోషన్, ఎన్టీఆర్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'వార్ 2'. 2019లో హిట్‌గా నిలిచిన హిందీ చిత్రం 'వార్'కు సీక్వెల్‌గా 'వార్ 2' తెరకెక్కుతోంది. 'వార్'కి సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించగా, 'వార్ 2'కు 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్ ముఖర్జీ దర్శకుడు. ఇప్పటికే 'వార్ 2' చిత్రీకరణ మొదలైందని, హృతిక్‌రోషన్ పాల్గొనగా కొంత చిత్రీకరణ కూడా జరిపారని టాక్. కాగా ఈ వారంలో 'వార్ 2' సెట్స్‌లో ఎన్టీఆర్ జాయిన్ అవుతారని బాలీవుడ్ సమాచారం. ఎన్టీఆర్‌పై ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట అయాన్ ముఖర్జీ. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా కనిపిస్తారని టాక్. 'వైఆర్ఎఫ్' (యశ్‌రాజ్ ఫిలింస్) స్పై యూనివర్స్‌లో భాగంగా రానున్న ఈ సినిమాను ఆదిత్యా చోప్రా నిర్మిస్తున్నారు. 'వార్ 2' చిత్రాన్ని వచ్చే ఏడాది ఆగస్టు 14న విడుదల చేయనున్నట్లుగా ఇప్పటికే చిత్రయూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

చలో రాజమహేంద్రవరం


● రామ్‌చరణ్


'గేమ్‌చేంజర్' కోసం రాజమహేంద్రవరం వెళ్లనున్నారట రామ్‌చరణ్. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'గేమ్‌చేంజర్'. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తుండగా, అంజలి, ఎస్‌జే సూర్య, శ్రీకాంత్, నవీన్‌చంద్ర, ప్రియదర్శి, జయరాం, సునీల్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ రాజమహేంద్రవరంలో జరగనుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. రామ్‌చరణ్‌తో పాటు ముఖ్యతారాగణం పాల్గొనే ఈ షెడ్యూల్ ఈ నెలాఖరులో ప్రారంభం కానుందని తెలిసింది. కథ రీత్యా సినిమాలో వచ్చే ఫ్లాష్‌బ్యాక్ సన్నివేశాలను చిత్రీకరిస్తారట శంకర్. రాజమహేంద్రవరం షెడ్యూల్ పూర్తయిన తర్వాత వైజాగ్‌కు వెళ్తారట యూనిట్. తమన్ ఈ సినిమాకు స్వరకర్త. ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది.. రిలీజ్ డేట్‌పై త్వరలోనే స్పష్టత రానుంది.

అక్టోబర్‌లో వేట్టయాన్


● రజనీకాంత్

అక్టోబర్‌లో థియేటర్స్‌కు వస్తున్నాడు 'వేట్టయాన్'. రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మూవీ 'వేట్టయాన్'. లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్, జీకేఎమ్ తమిళ కుమరన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రాన్ని ఈ ఏడాది అక్టోబరులో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. బూటకపు ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో రజనీకాంత్ ఓ పోలీసాఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా దగ్గుబాటి, మంజు వారియర్, కిషోర్, రితికా సింగ్, దుషార విజయన్ ఇతర పాత్రల్లో నటిస్తున్న 'వేట్టయాన్' సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీత దర్శకుడు.

పవర్‌ఫుల్ పాత్రలో...


● జగపతి బాబు

రవితేజ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునా హోగా' అన్నది ట్యాగ్‌లైన్. హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ మూవీలో కీలక పాత్రలో నటిస్తున్న జగపతిబాబు లుక్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. చెస్ మూవ్‌ని చేతిలో పట్టుకొని సీరియస్‌గా చూస్తున్న లుక్ బాగుంది. ''మిస్టర్ బచ్చన్'లో జగపతి బాబు పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుంది. రవితేజ, జగపతిబాబులను తెరపై చూడటం కనుల పండువగా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, సమర్పణ: పనోరమా స్టూడియోస్, టీ సిరీస్, సంగీతం: మిక్కీ జె. మేయర్, కెమెరా: అయనంక బోస్.

పెళ్లి పేరుతో మోసం చేశాడు

– సన్నీలియోన్



'ఓ వ్యక్తి ప్రేమ, పెళ్లి పేరుతో నన్ను మోసం చేశాడు' అన్నారు బాలీవుడ్ నటి సన్నీలియోన్. హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మరాఠి, బెంగాలి, మలయాళ భాషల్లోని పలు చిత్రాల్లో ప్రత్యేక పాటలతో పాటు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించి తనకంటూ ఓ గుర్తింపు సొంతం చేసుకున్నారు ఈ బ్యూటీ. 'కరెంట్ తీగ'(2014) సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చిన సన్నీలియోన్ 'పీఎస్‌వీ గరుడవేగ', 'జిన్నా' వంటి సినిమాల్లో నటించారు. ప్రస్తుతం ఆమె 'రంగీలా', 'వీరమదేవి', 'కొటేషన్ గ్యాంగ్', 'షీరో', 'కోకా కోలా', 'యువ' వంటి చిత్రాలతో బిజీగా ఉన్నారు. అదేవిధంగా 'స్ప్లిట్స్ విల్లా' అనే ఓ రియాలిటీ షోకి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు సన్నీ. తాజాగా ఈ షోలో ఆమె మాట్లాడుతూ–''కొన్నేళ్ల క్రితం ఒక వ్యక్తిని చాలా ప్రేమించాను. తను కూడా నన్ను ప్రేమించాడు. మా ఇద్దరికీ నిశ్చితార్థం కూడా జరిగింది. ఆ తర్వాత ఏదో తప్పు జరుగుతోందని, అతడు నన్ను మోసం చేస్తున్నాడేమోనని నా మనసుకు అనిపించింది. దీంతో 'నువ్వు నన్ను ఇంకా ప్రేమిస్తున్నావా?' అని ప్రశ్నిస్తే లేదన్నాడు. మరో రెండు నెలల్లో మా పెళ్లిని ప్లాన్ చేసుకున్నాం. హవాయి దీవుల్లో గ్రాండ్‌గా, జీవితాంతం గుర్తుండిపోయేలా వివాహం జరగాలని ప్లాన్ చేసుకున్నాం. ఇందుకోసం అన్నీ బుక్ చేసుకుని డబ్బులు కూడా ఇచ్చేశాను. పైగా పెళ్లి షాపింగ్ కూడా అయిపోయింది. ఇలాంటి సమయంలో తను అలా చెప్పడంతో నా మనసు ముక్కలైంది.. ఎంతో బాధపడ్డాను. ఆ తర్వాత భగవంతుడు నా జీవితంలో అద్భుతమైన మార్పులు తీసుకు వచ్చాడు. డానియల్ వెబర్‌ను పరిచయం చేశాడు. నా తల్లితండ్రులు చనిపోయినప్పుడు తను ఎంతో అండగా నిలిచాడు. మా ఇద్దరి మనసులు కలవడంతో పెళ్లి(2011) చేసుకున్నాం. ఎప్పటికీ నా భర్త చేయి వదలను'' అన్నారు.

అది రహస్యం కాదు!


● అదితీరావ్, సిద్ధార్థ్

''నేను, అదితీరావ్ హైదరీ కలిసి రహస్యంగా నిశ్చితార్థం చేసుకున్నామని చాలామంది అంటున్నారు. సీక్రెట్, ప్రైవేట్ అనే పదాలకు ఎంతో తేడా ఉంది. ఎవర్నీ పిలవకుండా, ఎవరికీ చెప్పకుండా చేసుకుంటే అది సీక్రెట్ అవుతుంది. కానీ, మా ఇరు కుటుంబసభ్యులతో కలిసి మేము ప్రైవేట్ ఫంక్షన్ చేసుకున్నాం. మా వారి సమక్షంలో జరిగిన నిశ్చితార్థం సీక్రెట్ ఎలా అవుతుంది'' అన్నారు హీరో సిద్ధార్థ్. గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్న సిద్ధార్థ్, హీరోయిన్ అదితీరావు హైదరీ మార్చి 17న వనపర్తి జిల్లాలోని శ్రీరంగపురంలోని ఆలయంలో నిశ్చితార్థం చేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ వేడుకలో పాల్గొన్న సిద్ధార్థ్‌కి నిశ్చితార్థం ఎందుకు రహస్యంగా చేసుకున్నారు? పెళ్లెప్పుడు? అనే ప్రశ్నలు ఎదురయ్యాయి. దీనికి సిద్ధార్థ్ స్పందిస్తూ– ''నా ప్రేమ విషయాన్ని తొలిసారి అదితీరావుకి చెప్పినప్పుడు తన నుంచి ఏం జవాబు వస్తుందా? అని ఎదురుచూశాను. కానీ, తను నా ప్రేమను అంగీకరించడంతో చాలా సంతోషపడ్డాను. ఇక మా పెళ్లి ముహూర్తం నా చేతుల్లో లేదు.. మా ఇరుకుటుంబ పెద్దలు నిర్ణయిస్తారు'' అన్నారు సిద్ధార్థ్.

ఎమోషనల్ థ్రిల్లర్


● వరలక్ష్మి

విలక్షణ నటి వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన పాన్ ఇండియా చిత్రం 'శబరి'. ఈ మూవీ ద్వారా అనిల్ కాట్జ్ దర్శకుడిగా పరిచయవుతున్నారు. మహర్షి కూండ్ల సమర్పణలో మహా మూవీస్ పతాకంపై మహేంద్రనాథ్ కూండ్ల తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో నిర్మించారు. ఈ సినిమాని మే 3న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ–''స్ట్రాంగ్ ఎమోషనల్ థ్రిల్లర్ చిత్రమిది. కథ, కథనాలు ఇన్నోవేటివ్‌గా ఉంటాయి. వరలక్ష్మి నటించిన గత సినిమాలకు పూర్తి భిన్నంగా 'శబరి' ఉంటుంది. ముఖ్యంగా ఆమె నటన వావ్ అనేలా ఉంటుంది. తెలుగు, తమిళ వెర్షన్స్ ఫస్ట్ కాపీ రెడీ అయ్యింది. మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. అన్ని భాషల ప్రేక్షకులకు నచ్చే చిత్రమిది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రాహుల్ శ్రీవాత్సవ, నాని చమిడి శెట్టి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సీతారామరాజు మల్లెల, సంగీతం: గోపీ సుందర్.

రైతు గంగమ్మ


● పార్వతి

విక్రమ్ హీరోగా నటించిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. పా. రంజిత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పార్వతీ తిరువోతు, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటించారు. పా. రంజిత్ నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. కాగా ఆదివారం(ఏప్రిల్ 7) పార్వతీ తిరువోతు బర్త్ డే. ఈ సందర్భంగా 'తంగలాన్' లో ఆమె నటించిన గంగమ్మ పాత్ర ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. లుక్ చూస్తే మహిళా రైతు పాత్రలో ఆమె నటించినట్లు తెలుస్తోంది. ''కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో వాస్తవ ఘటనలతో 'తంగలాన్' రూపొందింది. విక్రమ్‌ని విభిన్నమైన క్యారెక్టర్‌లో చూపించబోతున్నారు పా.రంజిత్. త్వరలోనే ఈ సినిమాని విడుదల చేయనున్నాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్.